
సాక్షి విశాఖపట్నం

మంగళవారం : 11 : ఏప్రిల్ : 2023



న్యూస్‌రీల్

డీఎస్సీ-98 అభ్యర్థులు అంగీకార పత్రాలు ఇవ్వాలి

విశాఖ విద్య: డీఎస్సీ-98 ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాలో 355 మంది ఎంపికైనట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను doevsp.net వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఎంపికైన అభ్యర్థులు మంగళవారం ఉదయం 10 గంటలకు విశాఖపట్నంలోని డీఈవో కార్యాలయంలో మినిమం టైం స్కేల్ పనిచేస్తామని కాంట్రాక్టు అగ్రిమెంట్ ఇవ్వాలన్నారు.

ఆరుగురు సీఐల బదిలీ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ పరిధిలో ఆరుగురు సీఐలు బదిలీ అయ్యారు. రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న బాసిన భాస్కరరావు, శ్రీకాకుళం డీఎస్‌బీలో పనిచేస్తున్న మారాదాన శ్రీనివాసరావును విశాఖ నగర పోలీస్ కమిషనరేట్‌కి అటాచ్ చేశారు. విజయనగరం డీఎస్‌బీలో పనిచేస్తున్న సీహెచ్ రుద్రశేఖర్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు సర్కిల్ సీఐగా, అక్కడ పనిచేస్తున్న జి.దేముడు బాబును విశాఖ రేంజ్ వీఆర్‌కి, విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న ఈ.నరసింహమూర్తిని విజయనగరం డీఎస్‌డీ-2కి, వీఆర్‌లో ఉన్న ఎం.వెంకటగణేష్‌ని శ్రీకాకుళం డీఎస్‌బీకి బదిలీ చేస్తూ రేంజ్ డీఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

12,13 తేదీలలో బొకారో ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ఖరగ్‌పూర్ డివిజన్‌లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగిన ప్రజా ఆందోళనల నేపథ్యంలో పలు రైళ్లు ఆలస్యంగా నడవడం, తిరుగు ప్రయాణానికి కావలసిన రేక్‌లు రోజుల తరబడి ఆలస్యంగా నడుస్తుండడంతో ధన్‌బాద్‌లో ఈ నెల 12,13 తేదీలలో బయల్దేరే ధన్‌బాద్-అలప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

విశాఖ-తిరుపతి స్పెషల్ రీ షెడ్యూల్

సోమవారం రాత్రి 7.10 గంటలకు బయల్దేరవలసిన విశాఖపట్నం-తిరుపతి(08583) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం ఉదయం 8.20 గంటలకు బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. భగత్‌కి కోటి నుంచి విశాఖ రావలసిన లింక్ రైలు సుమారు 13గంటలు ఆలస్యంగా నడుస్తుందన్నందున రీషెడ్యూల్ చేసినట్లు తెలిపారు.

8 తులాల బంగారం రికవరీ

సీతమ్మధార : చైన్‌స్నాచర్స్ నుంచి ఫోర్తుటౌన్ క్రైం పోలీసులు ఎనిమిది తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 4వ తేదీన ఉదయం 6.20 గంటల సమయంలో అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో శ్రీనివాసనగర్ ప్రధాన ద్వారం వద్ద రత్నావతి అనే మహిళ వాకింగ్ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలో మూడు తులాల పుస్తెలతాడును లాక్కొని పారిపోయారు. అలాగే అల్లిపురం, జ్ఞానాపురంలోను మహిళల మెడలో బంగారు నగలను అపహరించుకుపోయారు. దర్యాప్తు చేపట్టిన ఫోర్తుటౌన్ క్రైం పోలీసులు స్నాచర్స్ థానేలో ఉన్నట్లు గుర్తించి అక్కడకు వెళ్లారు. అక్కడ పెద్దలతో చర్చించి వారి నుంచి 8 తులాలు బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి మంత్రి అమర్ ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి

అక్కిరెడ్డిపాలెం (గాజువాక): గాజువాకలో శ్రీకృష్ణదేవరాయుల కల్యాణ మండప నిర్మాణానికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆర్థిక సహాయాన్ని మంత్రి పెదనాన్న, వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్ చేతుల మీదుగా గాజువాక సౌత్ జోన్ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయుల ట్రస్ట్ ప్రతినిధులకు రూ.4లక్షల 10 వేలను అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరామ్మూర్తి మాట్లాడుతూ మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు జ్ఞాపకార్థం ఈ ఆర్థిక సమాయాన్ని అందజేస్తున్నామని తెలిపారు.

సెంటుకు రూ.వెయ్యి!

- తహసీల్దారు కార్యాలయంలో వసూళ్లు
- ప్రత్యేకంగా ప్రైవేటు వ్యక్తి నియామకం
- నగదు ముట్టకపోతే 1బీ కొర్రీలు
- మహిళా వీఆర్‌వోలతో వెకిలిచేష్టలు?



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

సాధారణంగా వ్యవసాయ భూమిని ఎలా కొలుస్తాం? ఇదేం ప్రశ్న... ఎకరాల్లోనే కదా అని అంటారా? భీమిలి నియోజకవర్గంలోని ఒక తహసీల్దారు మాత్రం సెంట్లలోనే కొలుస్తారు. ఎందుకంటే ఇదే నా లెక్క అని స్పష్టంగా తెగేసి చెబుతున్నారు. ఇందుకు ఆయన చెబుతున్న కారణం కూడా విచిత్రంగా ఉంటోంది. ఎందుకంటే ఇవి విలువైన భూములనేది ఆయన వాదన. అందుకే సెంట్ల లెక్కే పక్కా అంటూ వసూళ్లకు తెగబడుతున్నారు. ఎవరైనా రైతుకు పట్టాదారు పుస్తకం కావాలంటే సెంటుకు రూ.వెయ్యి చొప్పున సమర్పించుకోవాల్సిందే. అంటే ఎకరాకు 100 సెంట్లు... అంటే లక్ష రూపాయలు ఇవ్వాల్సిందేనన్నమాట. ఆ తర్వాతే పని కానిస్తానని తెగేసి చెబుతున్నారు. అంతేకాదు ఈ వసూళ్లకు ప్రత్యేకంగా ఒక ప్రైవేటు వ్యక్తిని ఆయన నియమించుకున్నట్టు తెలుస్తోంది. సదరు వ్యక్తి ద్వారానే వసూళ్ల మొత్తం జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. ఒకవేళ ఎవరైనా అడిగిన మొత్తం ముట్టచెప్పకపోతే వెంటనే 1బీలో డిజిటల్ సంతకం తీసేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదరు ప్రైవేటు వ్యక్తి నేరుగా కార్యాలయంలో తిష్టవేసి కార్యాలయ సిబ్బంది తరహాలో తంచనుగా ప్రతీ రోజూ దర్శనమిస్తున్నారు. అంతేకాకుండా సదరు తహసీల్దార్ మహిళా వీఆర్‌వోలతో ప్రవర్తనపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎకరాకు రూ. లక్ష...!

ఒకవైపు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల రీ సర్వే చేపడుతోంది. చరిత్రలో మొదటిసారిగా రైతుల నుంచి ఒక్కపైసా వసూలు చేయకుండా ఏకంగా రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేస్తోంది. అంతేకాకుండా అవినీతికి తావులేకుండా నిర్ణీత సమయంలోగా ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిష్కరించమని స్పష్టంగా చెబుతోంది. అయినప్పటికీ సదరు తహసీల్దారు కార్యాలయంలోని సిబ్బంది మాత్రం పూర్తిగా పెడచెవిన పెడుతున్నారు. సెంటుకు రూ.1000 చొప్పున ఎకరాకు రూ.లక్ష మేర వసూలు చేస్తున్నారు. ఒకవేళ ఎవరైనా అంత ఎక్కువ ఇచ్చుకోలేమని బేరసారాలకు దిగితే వెంటనే ఆన్‌లైన్ 1 బీలో డిజిటల్ సంతకం లేకుండా చేస్తున్నారు. తద్వారా తిరిగి అదనపు మొత్తం చెల్లించి మరీ పని చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోనే ఈ స్థాయిలో ఎకరాకు రూ.లక్ష చొప్పున పట్టాదారు పాసుపుస్తకం కోసం వసూళ్లకు తెగబడటం ఇక్కడేననే విమర్శలున్నాయి. మరోవైపు తనతో చనువుగా ఉండాలంటూ కొద్దిమంది మహిళా వీఆర్‌వోలతో వెకిలిచేష్టలకు దిగుతున్నట్టు కూడా ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ప్రశ్నించిన వారిని పని పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్న తన సోదరుడు ద్వారా వివాదాలు ఉన్న భూములను తక్కువ ధరకు కొనిచ్చేలా చేస్తున్నట్టు కూడా తెలుస్తోంది. వివాదాలు ఉన్న భూములను గుర్తించడం... వాటిని తక్కువ ధరకే వచ్చేలా మధ్యవర్తిత్వం వహిస్తున్నారని కూడా సమాచారం.

డిజిటల్ చెల్లింపులు...!

ఇక తహసీల్దారు కార్యాలయంలో వచ్చే చిన్న చిన్న పనులకు కూడా నేరుగా డిజిటల్ చెల్లింపులు చేయాల్సిందే. ఇందుకోసం నేరుగా తమ బంధువుల ఫోన్ నంబరును సదరు ప్రైవేటు వ్యక్తి ఇస్తున్నారు. కార్యాలయం బయట బహిరంగంగా ఈ దందా జరుగుతున్నప్పటికీ తహసీల్దారు కార్యాలయ సిబ్బంది కన్నెత్తి చూడటం లేదు. పైగా అటు డిజిటల్ చెల్లింపులు చేసిన తర్వాతే ఇక్కడ తహసీల్దారు కార్యాలయంలో పనులు పూర్తి అవుతుండటం గమనార్హం. సదరు కార్యాలయం వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే మరిన్ని అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కేజీహెచ్, విమ్స్‌లో 200 పడకలు



క్రిటికల్ కేర్ యూనిట్‌ను సందర్శిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్



కోవిడ్ పడకలను పరిశీలిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

- కోవిడ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధం
- 100 ఆక్సిజన్ పడకలతో కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డులు
- విమ్స్‌లో ఆక్సిజన్ ట్యాంక్‌లు, ప్రత్యేక బ్లాక్
- ఏర్పాట్లు పరిశీలించిన కేజీహెచ్ సూపరింటెండెంట్, విమ్స్ డైరెక్టర్

కోవిడ్ కేసులు పెరుగుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కేజీహెచ్‌లో 100, విమ్స్‌లో 100 పడకలు సిద్ధం చేశారు. కోవిడ్ సన్నద్ధతలో భాగంగా సోమవారం రెండు ఆస్పత్రుల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. కోవిడ్ రోగులకు అవసరమైన వైద్య సేవల ఏర్పాట్లను పరిశీలించారు.

–మహారాణిపేట/ఆరిలోవ

కేజీహెచ్ క్యాజువాలిటీ మేడ మీద ఐసోలేషన్ వార్డులో 38 పడకలు, ఆ పక్కనే ఐఆర్‌సీఆర్ వార్డులో 12 వెంటిలేటర్లతో కూడిన పడకలు సిద్ధం చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు. అలాగే పాత ఎస్-1 వార్డులో 50 ఆక్సిజన్ పడకలతో ప్రత్యేక వార్డు సిద్ధం చేశామన్నారు. పడకలు, ఆక్సిజన్ ప్లాంట్, క్రిటికల్ కేర్ యూనిట్లను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులు పరిశీలించారు. ఆక్సిజన్ ప్లాంట్లు సిద్ధం చేయాలని, ఇబ్బందులంటే తక్షణం మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. క్రిటికల్ కేర్ యూనిట్‌ను సిద్ధం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకృష్ణ,డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ ఎ.పద్మజ, ఎఆర్‌ఎంవో డాక్టర్ కె.జగదీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 కల్పన మాలి తదితరులు పాల్గొన్నారు.

కరోనా సేవలకు విమ్స్ సిద్ధం

కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని రోగులకు వైద్య సేవలు అందించడానికి విమ్స్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఆక్సిజన్ ట్యాంక్‌లు, ప్రత్యేక బ్లాక్, పడకలు, తదితర వాటిని సిద్ధం చేశారు. సోమవారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. విమ్స్‌కు అంబులెన్స్‌లో వచ్చే కరోనా రోగికి ఏవిధంగా ప్రవేశం కల్పించాలి, ఎలాంటి చికిత్స అందించాలి, ఆక్సిజన్ అందించడం తదితర చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ రాంబాబు మాట్లాడుతూ కోవిడ్ ఎక్స్‌బీబీ 1.16 ఇతర దేశాలతో పాటు భారత్‌లో కూడా ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనాపై వైద్య శాఖను అప్రమత్తం చేశాయన్నారు. ఇందులో భాగంగా విమ్స్‌లో ఓ బ్లాక్ కరోనా చికిత్స కోసం కేటాయించామన్నారు. ప్రస్తుతం 100 పడకలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి 600 పడకలు అందుబాటులో తెస్తామన్నారు. రెండు ఆక్సిజన్ ట్యాంక్‌లు, రెండు ఆక్సిజన్ ప్లాంట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు.

గాజువాక భూ సమస్యలకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్

- త్వరలో వార్డుల వారీగా జాబితాల విడుదల
- ముదపాక రైతులకు త్వరలో ఎల్‌పీవోలు జారీ
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి



సాక్షి, విశాఖపట్నం : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న గాజువాక భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించామని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. ప్రస్తుతం ఈ సాఫ్ట్‌వేర్ ట్రయల్స్ పూర్తయ్యాయని త్వరలోనే తుది ట్రయల్స్ నిర్వహించిన అనంతరం.. వార్డుల వారీగా జాబితాలు విడుదల చేస్తామన్నారు. పట్టాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.71 వల్ల వేల మంది లబ్ధిదారులకు మేలు చేకూరనుంది. గాజువాకలో 65, 66, 67, 70 వార్డుల పరిధిలో వేల కుటుంబాలు హౌస్ కమిటీ ఆంక్షల నడుమ మూడు దశాబ్దాలుగా ఉక్కిరి బిక్కిరవుతున్నాయి. టీడీపీ హయాంలో ఆదరాబాదరాగా ఆక్రమిత స్థలాలకు పట్టాలు చేతిలో పెట్టినా రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు కొర్రీలు పడ్డాయి. 545 ఎకరాల్లో వేల మంది లబ్ధిదారులకు ప్రజా సంకల్పయాత్ర సమయంలో హామీ ఇచ్చిన మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొద్ది రోజుల క్రితం జీవో జారీ చేశారు. దీని ప్రకారం పట్టాల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. కొత్తగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో అర్హులకు సంబంధించిన జాబితాను అప్‌లోడ్ చేసి రెండు వారాల్లోగా వార్డు సచివాలయాల వారీగా ప్రదర్శిస్తామన్నారు. జాబితాలో అభ్యంతరాలుంటే సవరించేందుకు కొంత సమయం కేటాయిస్తామని.. అనంతరం రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వీలైనంత త్వరగా నిర్వహిస్తామని తెలిపారు. పెందుర్తి మండలం ముదపాకలో భూసమీకరణకు భూములిచ్చి.. ఎంజాయ్‌మెంట్ రిజిస్టర్‌లో పేర్కొన్న ప్రతి ఒక్క రైతుకు త్వరలో విశాఖ ఆర్డీవో కార్యాలయంలో ల్యాండ్ పూలింగ్ ఆక్యుపెన్సీ(ఎల్‌పీవో) సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు. ఏ ఒక్క రైతూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ.. అయితే కోర్టుని ఆశ్రయించిన రైతుల్ని ఇందులో మినహాయించినట్లు స్పష్టం చేశారు. ల్యాండ్ పూలింగ్‌కు వచ్చిన రైతులకు 73 లేఅవుట్స్‌లో ప్లాట్లు ఇచ్చామని త్వరలోనే వీటికి సంబంధించిన వివరాల్ని 22ఏ రికార్డుల నుంచి తొలగిస్తామని తెలిపారు. అదేవిధంగా విశాఖ నగర పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తూ.. రెగ్యులరైజేషన్ కోసం ఇంకా దరఖాస్తు చేసుకోని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తూ జారీ చేసిన జీవో నం.60ని కూడా అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ వెల్లడించారు.

అవినీతి వ్యాఖ్యలు అర్థరహితం

- పారదర్శకంగానే నగర సుందరీకరణ పనులు
- అంచనా వ్యయం రూ.111 కోట్లు కాగా రూ.83 కోట్లతో పనులు
- రూ.100 కోట్లు అవినీతి జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపణలు ఖండిస్తున్నా..
- మీడియా సమావేశంలో మేయర్ హరివెంకట కుమారి వెల్లడి



మాట్లాడుతున్న మేయర్ హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్ సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల

సాక్షి, విశాఖపట్నం : జీ-20 సదస్సులో భాగంగా చేపట్టిన విశాఖ నగర సుందరీకరణ పనుల్లో అవినీతి జరిగిందనడం అర్థరహితమని జీవీఎంసీ మేయర్ హరి వెంకట కుమారి అన్నారు. సోమవారం మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. జీ-20 సదస్సు నిర్వహణతో అంతర్జాతీయ స్థాయిలో విశాఖ ప్రతిష్ట పెరిగిందని కొనియాడారు. సదస్సులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నగర సుందరీకరణ జీవీఎంసీ చేపట్టిందన్నారు. మొత్తం రూ.111 కోట్ల అంచనా వ్యయంలో నగర సుందరీకరణకు రూ.83 కోట్లు వరకు ఖర్చు చేస్తే... కొందరు ప్రతిపక్ష కార్పొరేటర్లు రూ.100 కోట్లు అవినీతి జరిగిందని పిచ్చి ఆరోపణలు చేస్తున్నారన్నారు. వీలైతే అభివృద్ధికి సహకరించండి.. లేదంటే మౌనంగా ఉండండి.. లేనిపోని ఆరోపణలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రతీ పైసా లెక్క చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని, అభివృద్ధిపై ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగానే టెండర్ ప్రక్రియను బహిరంగంగా ప్రకటించలేదని తెలిపారు.

జీవీఎంసీ డిప్యూటీ మేయర్ సతీష్ మాట్లాడుతూ విశాఖను సుందర నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. అందులో భాగంగానే జీ-20కి నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దామన్నారు. కొందరు బ్లాక్ మెయిల్ పొలిటీషియన్స్ ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఒక ప్యాకేజీ కార్పొరేటర్.. బ్లాక్‌మెయిల్ రాజకీయం చేయడం.. పనులు చేసే కాంట్రాక్టర్‌ను బెదిరించి డబ్బులు తీసుకొనే ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. అధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ.. డబ్బులు డిమాండ్ చేయడం, డబ్బులు ఇవ్వకపోతే కోర్టులో కేసులు వేయడం ఇదే ఆయన పని అని విమర్శించారు. ఇప్పటికైనా బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకొని మంచిగా ఉంటే ప్రజలు ఆదరిస్తారు. లేదంటే విశాఖ నగర ప్రజలంతా తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయనది క్రిమినల్ బ్రెయిన్. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇలాంటి వ్యక్తిని ఎలా దగ్గర ఉంచుకుంటున్నాడో అర్థం కావడం లేదన్నారు. ఇలా అసత్య ఆరోపణలు చేసే వారిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రూ.100 కోట్లు అవినీతి జరిగిందని అంటున్న పీతల మూర్తి యాదవ్ పై సుమోటోగా కేసు నమోదు చేయాలని కోరారు. జీవీఎంసీ కౌన్సిల్ నుంచి పీతల మూర్తి యాదవ్‌ను శాశ్వతంగా తొలగించాలని మేయర్, జీవీఎంసీ కమిషనర్‌ను కోరుతున్నామన్నారు. ఇలాంటి వ్యక్తుల వల్ల విశాఖ ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతీ నోటా 'జగనన్నే మా భవిష్యత్తు'

వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



ప్రచార రథం ప్రారంభించిన అనంతరం నేతలతో వైవీ సుబ్బారెడ్డి



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

తాటిచెట్లపాలెం : ప్రతీ ఇంటా.. ప్రతీ నోటా జగనన్నే మా భవిష్యత్తు అంటున్నారని వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. జీవీఎంసీ 45వ వార్డు తారకరామనగర్‌లో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని స్థానికుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వాల కంటే ఈ ప్రభుత్వం ఏ రకంగా మేలు చేస్తుందో వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార రథం ప్రారంభం

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మరింత వినూత్నంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను వివరిస్తూ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ ప్రత్యేకంగా ప్రచార రథాన్ని రూపొందించారు. తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కనే గల అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ప్రారంభించారు.

నాల్గో రోజు రెట్టింపు ఉత్సాహంతో..

సాక్షి, విశాఖపట్నం: 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం జిల్లాలో ఉత్సాహంగా సాగుతోంది. నాలుగో రోజూ ఇంటింటి సర్వే కొనసాగింది. 93వ వార్డులో ప్రహ్లాదపురంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, 48వ వార్డు పలనాటి కాలనీ, నీలకంఠనగర్‌లో నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె రాజు, 22, 23వ వార్డులో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, 59వ వార్డు హిమాచల్‌నగర్‌లో పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, 27వ వార్డు అశోక్‌నగర్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. గృహ యజమాని అనుమతితో సర్వే చేసిన ఇంటికి, మొబైల్ ఫోన్‌కు స్టిక్కర్లు అతికించారు.

కమిషనర్‌పై ఆరోపణలు అవాస్తవం

జీవీఎంసీ ఈయూ నేత ఆనందరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరావు

దాబాగార్డెన్స్: జీ-20 పనుల్లో కమిషనర్ రాజాబాబు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి ఆరోపణలు అవాస్తవమని జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ నేత, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆనందరావు తెలిపారు. సోమవారం జీవీఎంసీ ప్రాంగణంలో గల జెమ్స్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మూర్తియాదవ్ తన వార్డు అభివృద్ధి పనులపై శ్రద్ధ చూపకుండా, నగరంలో అక్రమాలు, అవినీతి పేరిట అందరిపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. జీ-20 పనుల్లో రూ.83 కోట్లు మాత్రమే పనులు జరిగాయని, రూ.100 కోట్లు అవినీతి ఎలా జరిగిందని ప్రశ్నించారు. జెమ్స్ అధ్యక్షుడు, ఏసీపీ రామనారాయణ మాట్లాడుతూ విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఆరోపణ చేయడం సరికాదన్నారు. నగరాభివృద్ధి ముఖ్యమని, జీవీఎంసీ ప్రతిష్ఠ కాపాడాలన్నారు. జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు నర్సింగరావు మాట్లాడుతూ జీ-20లో ఉద్యోగులు, అధికారులు రాత్రి పగలు శ్రమించి పని చేశారని, నగరాభివృద్ధికి పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని, రాజకీయం చేయడం తగదన్నారు. సమావేశంలో పలు యూనియన్ల నేతలు ఆర్ సత్యం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి రాష్ట్ర స్థాయి నాటక పోటీలు



నాటక పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎస్ఎన్.రాజు, రాంబాబు, పైడా కృష్ణప్రసాద్

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీలను ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకూ మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నామని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు, పైడా కృష్ణ ప్రసాద్ తెలిపారు. సోమవారం కళాభారతి ఆడిటోరియంలో వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లగా ప్రతి ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్ర స్థాయి నాటక పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈఏడాది రాష్ట్ర స్థాయి నాటక పోటీలకు పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణా ప్రసాద్ సౌజన్యంలో స్వర్గీయ పైడా కౌశిక్ జ్ఞాపకార్థం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పోటీలకు దేశ వ్యాప్తంగా ఉన్న నాటక పరిషత్‌ల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. వీటిలో 9 నాటకాలను ఎంపిక చేశామన్నారు. ఈ 9 నాటికలు ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకూ రోజు రెండు నాటకాల చొప్పున ప్రదర్శిస్తారన్నారు. ఆఖరి రోజున ఒక నాటక ప్రదర్శించనున్నామన్నారు. నాటక పోటీలలో ప్రథమ స్థానానికి రూ.15వేలు, ద్వితీయ స్థానానికి 12వేలు, తృతీయ రూ.10వేలు, చతుర్థ స్థానానికి రూ.7,500లు చొప్పున నగదు బహుమతితోపాటు, జ్ఞాపికలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాటక పోటీల చీఫ్ కన్వీనర్ డాక్టర్. వేణు, బొడ్డేటి జగత్‌రావు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో మంత్రి అమర్‌నాథ్


మంత్రి అమర్‌నాథ్‌కు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న వెంకటేశ్వరరావు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం దర్శించుకున్నారు. మంత్రి హోదాలో ఆలయానికి రావడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, అర్చకులు సంప్రదాయంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వేదమంత్రోచ్చరణల మధ్య అంతరాలయ దర్శనం చేయించి మంత్రి పేరిట ప్రత్యేక అర్చనలు చేశారు.

అధికారుల గైర్హాజరుపై మేయర్ ఆగ్రహం

- డయల్ యువర్ మేయర్‌కు 14
- స్పందనకు 71 ఫిర్యాదులు
- దరఖాస్తు విచారణ జరపకుండా పరిష్కరించినట్టు ఎలా నమోదు చేస్తారు?
- ఇక నుంచి నేరుగా జోన్లకు వెళ్లి పరిశీలిస్తా..
- నగర మేయర్ వెంకటకుమారి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్పందనకు అధికారులు గైర్హాజరు కావడంపై మేయర్ గొలగాని హరివెంకట కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. డుమ్మా కొట్టిన వారి నుంచి వివరణ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మేయర్ చాంబర్లో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ మేయర్‌కు 14 ఫిర్యాదులు రాగా, జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబుతో కలిసి మేయర్ నిర్వహించిన స్పందనకు 71 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా మేయర్ హరివెంకట కుమారి మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులపై అలసత్వం వహించిన అధికారిపై చర్యలు తీసుకునేందుకు ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అర్జీదారు పెట్టుకున్న దరఖాస్తుపై సరైన విచారణ జరపకుండా పరిష్కరించినట్టు తన దృష్టికి వచ్చిందని, ఇకపై నేరుగా అర్జీదారుని పెట్టుకున్న వివరాలున్న జోన్లకు వెళ్లి పరిశీలిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజినీరు రవి కృష్ణంరాజు, చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్‌కుమార్, డీసీ (రెవెన్యూ) ఫణిరాం, సెక్రటరీ పి.నల్లనయ్య, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీపీవో చంద్రిక, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, డీఎఫ్ఓ, డీసీపీలు, ఏసీపీలు, పర్యవేక్షక ఇంజినీర్లు, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి దాతృత్వం

తన స్థలాన్ని ప్రభుత్వానికి రాసిచ్చిన వైనం


కలెక్టర్ మల్లికార్జునకు అంగీకార పత్రం అందజేస్తున్న వృద్ధురాలు కుంచమ్మ

గోపాలపట్నం : ఆ వృద్ధురాలు పెద్ద మనసు చాటుకుంది. తనకున్న 172 గజాల స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించింది. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో వృద్ధురాలు లావేటి కుంచమ్మ ఈ మేరకు తన అంగీకార పత్రాన్ని కలెక్టర్ మల్లికార్జునకు అందజేసింది. వివరాలు.. గోపాలపట్నంకు చెందిన లావేటి కుంచమ్మ (88) ఒంటరిగా జీవిస్తోంది. పాతికేళ్ల క్రితం సర్వే నంబర్ 1లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి నివాసం ఏర్పర్చుకున్నారు. భర్త లావేటి ముసలయ్య చాలా ఏళ్ల క్రితం మృతి చెందాడు. ఆమె కుమారుడు నూకరాజు 2020లో గుండెపోటుతో మరణించాడు. దీంతో ఒంటరిగా కుంచమ్మ అద్దె ఇంట్లో ఉంటోంది. తన తదనంతరం ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ప్రభుత్వానికి అప్పగిస్తున్నానని కుంచమ్మ తెలిపింది. ఈ స్థలంలో కమ్యూనిటీ హాలు, గ్రంథాలయం గానీ ఏర్పాటు చేయాలని కోరింది.

స్థలాన్ని పరిశీలించిన అధికారులు

కలెక్టర్ ఆదేశాల మేరకు గోపాలపట్నం ఆర్ఐ సురేష్ కుమార్, వీఆర్వో సుబ్రహ్మణ్యం ఈ స్థలాన్ని పరిశీలించారు. దీని విలువ రూ.50 లక్షలు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,430
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,400
వెండి(కిలో):	రూ.80,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	:రూ.95
స్కిన్	:రూ.160
స్కిన్‌లెస్	:రూ.170

పోలీసు స్పందనకు 50 ఫిర్యాదులు


ఫిర్యాదుదారుల నుంచి సమస్యలు వింటున్న అడ్మిన్ ఏడీసీపీ ఎంఆర్‌కే రాజు

అల్లిపురం (విశాఖ దక్షిణ): పోలీస్ స్పందనకు 50 ఫిర్యాదులు వచ్చాయని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అడ్మిన్ ఏడీసీపీ ఎం.ఆర్.కె.రాజు, నగర పోలీస్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు ఫిర్యాదులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసం, సివిల్ కేసులు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయని పేర్కొన్నారు.

సత్వరమే అర్జీల పరిష్కారం


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులకు సమాధానం ఇచ్చే ముందు ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి మళ్లీ తిరిగి రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. రీ ఓపెన్ అర్జీలు ఎందుకు వస్తున్నాయో చూసుకొని, పరిష్కారంలో ఎటువంటి అశ్రద్ధ వహించకూడదన్నారు. అనంతరం ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో 167 వినతులు అందాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కలెక్టర్ కార్యాలయం వద్ద నల్ల మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీజేఏసీ నాయకులు

మహారాణిపేట : ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సోమవారం ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు స్పందనలో వినతి పత్రం సమర్పించారు. ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల ఉద్యోగులు నల్ల మాస్కులు ధరించి కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. మొత్తం 50 అంశాలపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించామని జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ.త్రినాథరావు, కార్యదర్శి సీహెచ్‌వీ రమేష్, ఆర్టీసి ఉద్యోగుల జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఎస్.రావు, పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవికుమార్, ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, ఏపీఎన్‌జీవో సిటీ కార్యదర్శి వీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

20 బస్తాల పీడీఎఫ్ బియ్యం పట్టివేత


ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఆవరణలో పీడీఎఫ్ బియ్యంతో ఉన్న ఆటో

ఆరిలోవ : పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ ఆటోలో పీడీఎఫ్ బియ్యం పట్టుబడ్డాయి. నగరం నుంచి ఆరిలోవ వైపు వస్తున్న ఏపీ 39 ఎక్స్ 6265 నంబరు గల ఆటోను పోలీసులు ఆదివారం రాత్రి ఆపారు. ఆటో డ్రైవర్‌కు మద్యం పరీక్ష చేశారు. అనంతరం ఆటోలో ఏం తరలిస్తున్నాడో పరిశీలించారు. ఆటో అంతా పూర్తిగా కప్పేసిన కవర్లు తొలగించారు. దానిలో రేషన్ బియ్యం బస్తాలు ఉన్నాయి. ప్రభుత్వం సరఫరా చేసిన సంచుల్లోనే ఆ బియ్యాన్ని దొంగతనంగా బయట తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆటోను ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అందులో 20 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. దీనిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు. ఆటో నడిపిన డ్రైవర్ తేజాపై కేసు నమోదు చేశారు. బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగిస్తామన్నారు. నేరుగా రేషన్ డిపో నుంచే ఆ బియ్యాన్ని ఆటోలో దొంగతనంగా తరలిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

పోలీసులపై ఒత్తిడి..

ఆటోలో బియ్యం తరలించే వ్యక్తిపై కేసు నమోదు చేయవద్దంటూ టీడీపీ నాయకులు కొందరు పోలీసులపై ఒత్తిడి చేసినట్టు సమాచారం. అందుకే ఆదివారం రాత్రి బియ్యం పట్టుబడితే సోమవారం రాత్రి వరకు కేసు చేయకుండా తాత్సారం చేశారు. సోమవారం రాత్రి వరకు పౌర సరఫరా విభాగం అధికారులుకు కూడా పోలీసులు సమాచారం ఇవ్వకపోవడం ఇందుకు బలం చేకూరుస్తోంది.

బాక్సైట్ కేసులో సీపీఐ నాయకులకు విముక్తి


జిల్లా కోర్టు వద్ద వివరాలు వెల్లడిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం: విశాఖ ఏజెన్సీలో (ఏఎస్ఆర్ జిల్లా) బాక్సైట్ నిక్షేపాలు వెలికితీయాలన్న తెలుగుదేశం ప్రభుత్వ తీరును నిరసిస్తూ సీపీఐ ఆందోళనలపై పోలీసులు పెట్టిన కేసును సోమవారం కోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా సీపీఐ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, డి.మార్కండేయులు, టి.వెంకటేశ్వరరావులు జిల్లా కోర్టు వద్ద మాట్లాడుతూ 2015 నవంబర్ 6వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో తెలుగుదేశం ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన నేపథ్యంలో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ చేపట్టిన రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కేవీఎల్ హిమబిందు కేసును కొట్టివేశారని వారు తెలిపారు. దీంతో ఈ కేసులో తమకు విముక్తి లభించిందని వారు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ఆనాడు బాక్సైట్ నిక్షేపాలు వెలికి తీయాలన్న ప్రతిపాదనను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తూ గిరిజనుల పక్షాన నిలిచిందన్నారు. ఇది పార్టీ ప్రజా పోరాట విజయమన్నారు.

గంజాయితో నలుగురి అరెస్ట్

అల్లిపురం (విశాఖ దక్షిణ) : గంజాయి వ్యాపారం చేస్తున్న నలుగురిని మహారాణిపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 22 కేజీల గంజాయి, ఒక కారు, రెండు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

సింహాద్రి హాస్పటల్ వద్ద ఒక గదిని అద్దెకు తీసుకుని గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్సు, మహారాణిపేట పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు ప్రాంతానికి చెందిన కిల్లో ప్రసాదరావు, కిల్లో సురేష్, ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన సిద్దిక్ కోరా, బీహార్ రాష్ట్రం కద్దాపూర్‌కు చెందిన తారిక్ అన్వర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అర్హులందరికీ మిషన్ వాత్సల్య ఫలాలు

ఎస్సీపీసీఆర్ సభ్యుడు గొండు సీతారాం


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న గొండు సీతారాం

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): అర్హులైన పిల్లలు అందరికీ మిషన్ వాత్సల్య పథకం ఫలాలు అందాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్సీపీసీఆర్) సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ అధికారులకు సూచించారు. ఇటీవల దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకం అమలు కార్యాచరణపై స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గొండు సీతారాం మాట్లాడుతూ 0–18 ఏళ్ల వయసు కలిగి తల్లి లేదా తండ్రిని, తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక భరోసాను ఇస్తున్నాయన్నారు. చదువు, వైద్యం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయకారిగా నిలవనున్నాయన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎంత మంది ఈ తరహా పిల్లలను గుర్తించారు, ఎంత మంది ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు, ఎంత మంది పిల్లలకు బ్యాంకు అకౌంట్‌లు తెరిచారు, వారికి ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు వంటి విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ఎంఆర్‌ఎల్ రాధ, స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత శాఖాధికారిని వెంకటేశ్వరి, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యురాలు విజయ, బాలల సంరక్షణ అధికారి రమేష్, పీఓఐసీ మమత, ఎల్‌సీపీఓ అనీజ కుమారి, సోషల్ వర్కర్లు ఆనంద్, సులేఖ, సత్యనారాయణ, రామలక్ష్మి, ఎఎస్సార్, జిల్లా సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ డాక్టర్ పి.లవకుశ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు

సీతమ్మధార (విశాఖ ఉత్తర): ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి బేడీలతో పరారైన గంజాయి నిందితుడు సత్తిబాబును చెన్నైలో విశాఖ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లిక్విడ్ గంజాయి కేసులో చోడవరం మండలం లక్ష్మీపురానికి చెందిన సియాదుల సత్తిబాబు ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి శనివారం ఉదయం బేడీలతో పరారైన విషయం తెలిసిందే. ఈస్ట్ ఇన్‌చార్జ్ ఏసీపీ వివేకానంద ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్ఐ వెంకటరావు, కానిస్టేబుళ్ల బృందం నగరంలోనూ, నిందితుడు స్వగ్రామం లక్ష్మీపురంలో గాలింపు చర్యలు చేపట్టింది. చివరకు విశాఖ రైల్వేస్టేషన్‌లో చెన్నై ట్రైన్ ఎక్కినట్లు గుర్తించారు. రైల్వేస్టేషన్‌లో నిందితుడు ట్రైన్ ఎక్కుతున్నట్టు సీసీ పుటేజ్‌లో రికార్డ్ కావడంతో ఆ మేరకు పోలీస్ బృందం బయలుదేరి వెళ్లింది. చెన్నైలో సీసీ పుటేజ్‌ల ఆధారంగా సత్తిబాబును అదుపులోకి తీసుకొని విశాఖ తీసుకొస్తున్నారు.

ట్రయాథ్లాన్ విజేత ఉజ్వల్


పరుగులో పాల్గొన్న ఉజ్వల్

విశాఖ స్పోర్ట్స్ : మంగళూర్ ట్రయాథ్లాన్‌లో నావికాదళానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ ఉజ్వల్ చౌదరి విజేతగా నిలిచాడు. ఆదివారం కర్నాటకలోని తన్నీర్‌భవిలో జరిగిన ఈ పోటీలో దాదాపు 500 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. దీనిలో నావికాదళానికే చెందిన 40 మంది అథ్లెట్లు ఉన్నారు. వారిలో ఉజ్వల్ రెండు గంటల 37 నిమిషాల్లో ఈవెంట్ ముగించి విజేతగా నిలిచాడు.

భూసార పరీక్షలకు సన్నద్ధం!

- ఏడాది తర్వాత మళ్లీ ప్రారంభం
- ఆర్బీకేల్లో వేసవి రెండు నెలలు పరీక్షలు
- రేపట్నుంచి ఏడీలు, ఏవోలకు శిక్షణ
- శాంపిళ్ల ఆధారంగా రైతులకు పంటలపై సిఫార్సు


భీమిలి మండలం సింగనబందలో గత ఏడాది నిర్వహించిన భూసార పరీక్షలు (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: భూసార పరీక్షలకు వ్యవసాయ శాఖ సన్నద్ధమవుతోంది. ఏడాది క్రితం ఈ పరీక్షలను నిర్వహించింది. ఇప్పుడు మళ్లీ ఈ సాయిల్ శాంపిల్ టెస్ట్‌లు చేపట్టనుంది. ఈ భూసార పరీక్షల్లో వచ్చిన ఫలితాలను బట్టి భూముల్లో ఎలాంటి పంటలు వేయాలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తారు. సాధారణంగా వేసవిలో పంటలు అంతగా ఉండవు. అందువల్ల వేసవి కాలం అనువుగా ఉంటుందన్న ఉద్దేశంతో భూసార పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది అదే తరహాలో ఏప్రిల్, మే నెలల్లో రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్బీకేల్లో) ఈ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులోభాగంగా ఈనెల 12 నుంచి జిల్లా స్థాయిలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీలు), వ్యవసాయ శాఖాధికారుల (ఏవోలు)కు, 16వ తేదీ నుంచి మండల స్థాయిలో సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం భూసార పరీక్షలకు శ్రీకారం చుడతారు. జిల్లాలో కొన్ని చోట్ల వరితో పాటు మరి కొన్ని పంటలు కోత కోయాల్సి ఉంది. నెలాఖరు నాటికి వీటి కోతలు పూర్తవుతాయి. ఈలోగా పంటలు లేని భూముల్లో సాయిల్ శాంపిల్ టెస్టింగ్ మొదలు పెడతారు. నెలాఖరు నుంచి కోతలు/పంటలు పూర్తయిన భూముల్లో పరీక్షలు ప్రారంభిస్తారు. విశాఖ గ్రామీణ జిల్లాలో పెందుర్తి, భీమునిపట్నం, పద్మనాభం, ఆనందపురం మండలాలున్నాయి. ఈ మండలాల్లో 26,255 ఎకరాల విస్తీర్ణంలో సాగు భూమి ఉంది.

భూసార పరీక్షలు ఇలా చేస్తారు..

వ్యవసాయ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో ఉచితంగానే భూసార పరీక్షలు నిర్వహిస్తారు. ఆ గ్రామంలో ఏఏ రకాల భూమి ఉందో చూస్తారు. వేర్వేరు రకాల భూములుంటే విడిగా పరీక్షలు నిర్వహించి శాంపిళ్లను సేకరిస్తారు. అవసరమైతే ఒక గ్రామంలో పది వరకు పరీక్షలు చేస్తారు. పరీక్షల అనంతరం భూసార పరీక్షల రిపోర్టులను కార్డుల రూపంలో సంబంధిత ఆర్బీకేల్లో ఇస్తారు. వాటిని రైతులకు అందజేస్తారు. ఆ భూసార పరీక్షల రిపోర్టుల ఆధారంగా రైతులు ఈ ఏడాది ఎలాంటి పంటలు వేసుకోవాలి? ఏ తరహా ఎరువులు వాడాలి?, ఎంత మోతాదులో వేయాలి? వంటివి వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తారు. దీంతో రైతులు ప్రస్తుత భూసారానికి అనువైన పంటలనే వేయడం వల్ల మేలైన దిగుబడులు సాధించడానికి వీలవుతుంది. మరోవైపు భూసార పరీక్షల నిర్వహణపై సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో రైతులకు తెలియజేస్తున్నారు. భూసార శాంపిళ్ల కలెక్షన్లు చేపడతామని, రైతులు సిద్ధంగా ఉండాలని కోరుతున్నట్టు జిల్లా వ్యవసాయ శాఖాధికారి అప్పలస్వామి 'సాక్షి'కి చెప్పారు. ఉచితంగా నిర్వహించే భూసార పరీక్షలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ


సర్టిఫికెట్లు అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం అశోక్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ సోమవారం ముగిసింది. స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎం.ఎస్.ఎం.ఈ) సహకారంతో నగరంలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో రూ. 9.98 లక్షల వ్యయంతో క్యాడ్, క్యామ్ మాస్టర్ సర్టిఫికెట్ కోర్సు కోసం శిక్షణ ఏర్పాటు చేశారు. 15 మందికి నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఎస్ఆర్ జీఎం ఎ. అశోక్, ఎంఎస్ఎంఈ డీజీఎం జి. ప్రసాద రెడ్డి పాల్గొని అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్, ఎంఎస్ఎంఈలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.